# బలగం TV
BALAGAM
నిజమే బా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 15 మార్చి-2026 | balagamtv100@gmail.com | పేజీలు-4


## మునగ, పండ్ల చెట్లను నర్సరీల్లో సిద్ధం చేయాలి..



## ముందు హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేయండి



# సుందరీకరణ పేరిట దోపిడీ

- రూ.16 వేల కోట్ల ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఎందుకు?
- మూసీని మురికి కూపంగా మార్చిన పాపం కాంగ్రెస్‌దే : కేటీఆర్
- పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్ పేరుతో సమావేశం



హైదరాబాద్, మార్చి 14: మూసీ సుందరీకరణ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి దోపిడీకి తెరలేపారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ ఆరోపించారు. కేవలం రూ.16,634 కోట్ల వ్యయంతో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఎందుకని ప్రశ్నించారు. వాస్తవానికి మూసీనదిని మురికి కూపంగా మార్చిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని, ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పాపాన్ని కడగడానికి కేసీఆర్ హయాంలో తాము మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఇందుకోసం ఒక్క ఇల్లు కూడా పోకుండా ఉండేలా అంతర్జాతీయ స్థాయి ఆర్కిటెక్ట్ కంపెనీల ద్వారా పది డిజైన్లు తీసుకుని.. ఒక దానిని ఎంపిక చేసి ప్రభుత్వానికి అప్పగించామని చెప్పారు. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం వేల మంది ఇళ్లు కూలగొట్టి, వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకుని మూసీ సుందరీకరణ చేస్తామంటున్నారని ధ్వజమెత్తారరు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి తెరలేపిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాన్ని ప్రతి దశలోనూ అడ్డుకుంటామని ప్రకటించారు. శనివారం సాయంత్రం హిమాయత్‌సాగర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'పవర్ పాయింట్ వర్సెస్ పబ్లిక్ పాయింట్' పేరిట కార్యక్రమం నిర్వహించారు. మూసీ సుందరీకరణ తొలి దశలో ఉప్పల్ భగాయత్ నుంచి నాగోల్ వరకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల తీరు, మారిన అక్కడి స్వరూపాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ అనుమతులు లేకుండా, డీపీఆర్ తయారు చేయకుండా, పునరావాస, నష్టపరిహార విధానాలు ఖరారు చేయకుండా బాధితుల ఇళ్లపై రెడ్‌మార్ కలు వేసి.. వారి గుండెల్లో గునపాలు దింపారని కేటీఆర్ ఆరోపించారు. బఫర్‌జోన్‌లో ఇళ్లు, స్థలాలు ఉన్నవారికి జీరో వాల్యూ ఉంటుందంటున్న ముఖ్యమంత్రి.. ఆయా ఆస్తులను నిషేధిత జాబితాలోకి ఎందుకు ఎక్కించారని ప్రశ్నించారు. మూసీకి అటు ఇటు 500 మీటర్ల బఫర్ జోన్ పేరిట పేదలు, మధ్య తరగతి వారి ఇళ్లను కూల్చడానికి నోటీసులు జారీ చేసిన ప్రభుత్వం.. చెరువులో ఇళ్లు కట్టిన మంత్రి పొంగులేటి, మహేందర్‌రెడ్డి, వివేక్ తదితరుల ఇళ్ల జోలికి ఎందుకు వెళ్లడం లేదని నిలదీశారు. కోస్గిలో ముఖ్యమంత్రి ఇల్లు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉందని, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు కూడా ఎఫ్‌టీఎల్ ఉందని, దానిని ఎందుకు కూల్చడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల్లో ఆరు హామీలు నెరవేర్చడానికి డబ్బులేదు గానీ, లక్షల కోట్లు ఎక్కడి నుంచి సీఎం తీసుకుని వస్తారని ప్రశ్నించారు. నమామి గంగా ప్రాజెక్టు 2వేల కిలోమీటర్లకు రూ.42 వేల కోట్లు ఖర్చయితే.. 55 కిలోమీటర్ల దూరానికి రూ.లక్షన్నర కోట్లు ఎందుకు అవుతాయన్న విషయం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో "రాజు వెడ్స్ రాంభాయి"

- మూవీ రిపీట్..

**యువతికి హెచ్ఐవీ ఇంజెక్షన్ !!**




తెలంగాణ రాష్ట్రంలో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం "రాజు వెడ్స్ రాంభాయి". రీసెంట్ గానే విడుదలైన ఈ సినిమాలో హీరోయిన్‌కు ఆమె తండ్రే హెచ్ఐవీ సోకిన రక్తం ఇంజెక్షన్ ఇవ్వడం కథలో కీలక సన్నివేశంగా ఉంటుంది. ప్రేమించిన వ్యక్తిని మర్చిపోకపోవడంతో కోపంతో కూతురినే చంపాలని ప్రయత్నించే తండ్రి పాత్ర అందులో కనిపిస్తుంది. అయితే ఇప్పుడు అలాంటి ఘటన నిజ జీవితంలో చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. ఈ దారుణ ఘటన హైదరాబాద్ నగర పరిధిలోని పోచారం ప్రాంతంలో చోటుచేసు కుంది. అయితే ఆ మూవీలో తండ్రి అలా చేస్తే.. ఇక్కడ మా త్రం యువతి పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు ఈ ఘాతుకానికి పాల్పడటం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం.. పోచారం ప్రాంతానికి చెందిన మనోహర్ అనే యువకుడికి ఒక యువతితో వివాహం నిశ్చయమైంది. కుటుంబ సభ్యుల సమక్షంలో పెళ్లి మాటలు కూడా జరిగాయి. అయితే కొద్ది రోజుల తర్వాత మనోహర్‌కు హెచ్ఐవీ ఉందని యువతి కుటుంబానికి తెలిసింది. దీంతో యువతి వెంటనే పెళ్లికి నిరాకరించింది. పెళ్లి రద్దు కావడంతో మనోహర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. తనను అవమానిం చారని భావించి యువతిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 11వ తేదీన ఆమె ఇంటికి వెళ్లి మళ్లీ తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేశాడు. అప్పుడు కూడా యువతి స్పష్టంగా పెళ్లికి నిరాకరించడంతో మనోహర్ ఆగ్రహంతో ముందే తీసుకువ చ్చిన సిరంజ్‌తో ఆమెకు బలవంతంగా ఇంజెక్షన్ ఇచ్చినట్లు సమాచారం. ఇంజెక్షన్ ఇచ్చిన వెంటనే అతడు అక్కడి నుంచి పారిపోయాడు. పోలీసుల ప్రాథమిక విచారణలో మనోహర్‌తో పాటు అతని తల్లిదండ్రులకు కూడా గతంలోనే హెచ్ఐవీ ఉన్నట్లు సమాచారం బయటపడింది. ఈ విషయం తెలిసిన తర్వాతే యువతి పెళ్లికి నిరాకరించినట్లు తెలుస్తోంది.

# పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు : కేంద్రం




హైదరాబాద్, మార్చి 14: కేంద్ర పెట్రో లియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రక టన చేసింది. దేశంలో పెట్రో ల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచిం చింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమా దకరమని హెచ్చరించిం ది.తమిళనా డులో ఒక పెట్రోల్ బంక్ నుంచి సాధారణ కంటెయినర్‌లో పెట్రోల్ తరలించిన వైనం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ సూచన చేస్తున్నట్టు తెలిపింది. ఇలాంటి చర్యలతో భద్రతా పరమైన ముప్పు పెరుగు తుందని హెచ్చరించింది. ఇలా పెట్రోల్‌ను విక్రయిం చిన రిటైల్ ఔట్‌లెట్‌పై తగిన చర్యలు తీసుకున్నామని కూడా పెట్రోలియం శాఖ వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ విక్రయాలకు సంబంధించి పెట్రోల్ పంప్‌లు, డీలర్లకు భద్రతాపరమైన మార్గదర్శకాలు జారీ చేశామని కూడా కేంద్రం పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రిఫైనరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రిఫైనరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు.

# పాకిస్థాన్ మళ్లీ దాడులు..

## భారత్ స్ట్రాంగ్ రిప్లై..!



అఫ్గానిస్తాన్‌లో పాకిస్థాన్ జరిపిన తాజా వైమా నిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులలో పౌరులకు ప్రాణనష్టం, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేశాయి. ఈ ఘటనపై విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించారు. ఇది "సార్వభౌమ అఫ్గానిస్తాన్ కు శత్రువైన పాకిస్తాన్ మరో ఆక్రమణ చర్య" అని ఆయన అభివర్ణించారు. అఫ్గానిస్తాన్ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమ గ్రతను పూర్తి స్థాయిలో గౌరవించాలని భారత్ తన నిబద్ధతను బలంగా పునరుద్ఘాటించిందని అన్నారు. అయితే భారత్ స్పందించడం కంటే ముందు.. అఫ్గానిస్తాన్ లోని తాలిబాన్ ప్రభు త్వం పాకిస్థాన్‌పై ఆరోపణలు చేసింది. కాబూ ల్, తూర్పు అఫ్గానిస్తాన్ లోని ఇతర ప్రాం తాలలో పాక్ వైమానిక దాడులు జరిపిందని.. కనీసం ఆరుగురు పౌరులు మరణించగా, 15 మంది గాయపడ్డారని పేర్కొంది. కాందహార్ విమానాశ్రయం సమీపంలోని కామ్ ఎయిర్ ప్రైవేట్ ఎయిర్‌లైన్ కు చెందిన ఇంధన డిపో లపై కూడా పాక్ విమానాలు దాడి చేశాయని అఫ్గానిస్తాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపా రు. కొన్ని గంటల తర్వాత, కాబూల్ కూడా ప్రతిస్పందించినట్లు ప్రకటించి, ఇస్లామాబాద్ తో పాటు వాయువ్య పాకిస్థాన్ లోని సైనిక స్థావరాలను తమ వైమానిక దళం లక్ష్యంగా చేసుకుందని తెలిపింది. అయితే, తాజా నివేదనల ప్రకారం, పాకిస్థాన్.. పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని.. తమ దాడులు పాకిస్తానీ తాలిబాన్ మిలిటెంట్లు, వారి సహాయక నెట్ వర్క్ లపైనే దృష్టి సారించాయని వివరించింది. ఈ మేరకు ఈ ఘర్షణను ఓపెన్ వార్ గా అభివర్ణించింది. మధ్యప్రాచ్యంలో ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల నడుమ, ఈ ఘర్షణలు ప్రాంతీయ స్థిరత్వంపై అంతర్జాతీయ సమాజంలో ఆందోళనలను రేకెత్తించాయి. అఫ్గానిస్తాన్ లోని తాలిబాన్ ప్రభుత్వం తమ దేశంలో పాకిస్తానీ మిలిటెంట్ గ్రూపులకు, ముఖ్యంగా పాకిస్తానీ తాలిబాన్ కు ఆశ్రయం కల్పిస్తోందని పాకిస్తాన్ ఆరోపిం చింది. ఈ మిలిటెంట్లు సరిహద్దు దాటి తమ బలగాలపై దాడి చేస్తున్నారని, అఫ్గానిస్తాన్ తమ ప్రత్యర్థి భారత్ తో జతకడుతోందని పాక్ పేర్కొంది. అయితే కాబూల్ ఈ ఆరోపణలను పూర్తిగా ఖండించింది.

# గ్యాస్ సరఫరా ఇకపై 20% పరిమితం

## ఆసుపత్రులు, రైల్వేలకు టాప్ ప్రయారిటీ




హైదరాబాద్, మార్చి 14: ఇరాన్ యుద్ధం కారణంగా దేశంలో వంటగ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభా వం పడింది. దేశంలోని వివిధ నగరాల్లో వంటగ్యాస్ కొరత తీవ్రమైంది. డొమెస్టిక్, కమర్షి యల్ అనే తేడా ఏదీ ఉండట్లేదు. అన్ని వర్గాల వారి మీదా దీని ప్రభావం పడింది. హోటళ్ల యజమానులు ఏకంగా సెలవులను ఇచ్చుకునే పరిస్థితి తలెత్తిందంటే దీని తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏపీ, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి తలెత్తింది. వంట వండటానికి ఇతర వనరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రాధాన్యత ఆధారిత పంపిణీ విధానాన్ని ప్రకటించింది ఢిల్లీ ప్రభుత్వం. కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ నిర్ణయాన్ని తీసుకుంది. వాణిజ్య సిలిండర్ల రోజువారీ పంపిణీని సగటు వినియోగంలో సుమారు 20 శాతానికి పరిమితం చేసింది. ఈ నిర్ణయం వాణిజ్య సంస్థలకు ఇంధన లభ్యతపై ప్రభావం చూపనుంది. ఢిల్లీలో సాధారణంగా రోజుకు దాదాపు 9,000 వాణిజ్య సిలిండర్లు సరఫరా అవుతుంటాయి. కొత్త విధానం కింద ఇకపై 1,800 సిలిండర్లు మాత్రమే పంపిణీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆహార, పౌర సరఫరాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నగర సగటు రోజువారీ వాణిజ్య వినియోగంలో 20 శాతం మాత్రమే సరఫరా చేయాలని నిర్ణయించింది.

# తెలంగాణలో పెరుగుతున్న కల్తీ ఫుడ్..



హైదరాబాద్, మార్చి 14: తెలంగాణలో విచ్చల విడిగా కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు స్పష్టం అవుతోంది. ఇటీవల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు, కల్తీ పెరుగు గుట్టు రట్టు అయిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గడచిన మూడేళ్లలో 14,312 ఫుడ్ శాంపిల్స్ ను టెస్టింగ్ చేయగా కేవలం 16 లైసెన్సులు మాత్రమే రద్దు చేసినట్లు సమాచారం. అలాగే జీరో క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇదే విషయంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ట్వీట్ చేశారు. కల్తీ నిర్వాహకులను పట్టుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని అన్నారు. తెలంగాణ ఫుడ్ సేఫ్టీ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. నిందితులను శిక్షించడంలో విఫలం అవుతున్నారని ట్వీట్ చేశారు. ప్రభుత్వ డేటా ప్రకారం ఫుడ్ శాంపిల్ టెస్టులు గణనీయంగా దాదాపు 46 శాతం తగ్గినట్లు తెలిపారు. అలాగే సివిల్ కేసులు కూడా 71 శాతం తగ్గిపోయినట్లు కవిత స్పష్టం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఒక్కటంటే ఒక్కటి కూడా క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడం గమనార్హం అని తెలిపారు. కేవల ఒకే ఒక లైసెన్స్ ను రద్దు చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఇతర రాజకీయ పార్టీలు కూడా ఈ విషయంపై పోరాడకపోవడం దురదృష్టకరమని అన్నారు.

# పైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్‌లో కాల్పుల కలకలం

- గాల్లోకి కాల్పులు జరిపిన డ్రగ్స్ పార్టీలోని వ్యక్తి
- ఎనిమిది మందికి డ్రగ్స్ పరీక్షలు జరిపిన పోలీసులు
- ఆ సమయంలో ఫాంహౌస్‌లో ఏపీకి చెందిన ఓ ఎంపీ
- రోహిత్ రెడ్డి అరెస్టు.. 2 గ్రాముల కొకైన్, రివాల్వర్ స్వాధీనం



హైదరాబాద్, మార్చి 14: తాండూరు మాజీ ఎమ్మెల్యే (బీఆర్ఎస్) పైలెట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫాంహౌస్ మరోసారి వార్తల్లో నిలి చింది. శనివారం రాత్రి ఇక్కడ కాల్పులు కలకలం సృష్టించాయి. అక్కడ డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారం రావడంతో ఈగల్ బృందాలు మెరుపు దాడులు చేశాయి. ఆ సమయంలో డ్రగ్స్ పార్టీ చేసుకుం టున్న వ్యక్తుల్లో ఒకరు తొలుత గాలిలోకి ఒక రౌండు; తర్వాత ఈగల్ బృందంపై మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈగల్ టీమ్‌ను అడ్డుకుని హంగామా చేయ డానికి ప్రయత్నించినట్లు తెలిసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌వోటీ) రంగంలోకి దిగింది. పోలీసుల సోదాల్లో 2 గ్రాముల కొకైన్, ఇతర మత్తు పదార్థాలతోపాటు రివాల్వర్ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అక్కడ ఎనిమిది మంది డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్నట్లు తెలిసింది. వీరందరినీ అదుపులోకి తీసుకుని పరీక్షలు చేస్తున్న పోలీసులు వచ్చిన రిపోర్టుల ఆధారంగా అరెస్టులు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే పైలెట్ రోహిత్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఫాంహౌస్‌లో ఆ సమయంలో ఏపీ ఏలూరు ఎంపీ పుట్ట మహేశ్ యాదవ్, మొరగనేని రమేశ్,వి.శ్రావణ్ కుమార్,నల్లపనేనివిజయ్ కృష్ణ, రితీశ్ రెడ్డి, నీవిత్ శర్మ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరు మూడు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నాయకులు అన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించడం లేదు. ఈ అంశానికి సంబంధించి ఆదివారం పోలీసులు వివరాలు వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది.

balagamtv100@gmail.com

## శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కళ్యాణం





బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :మండేపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18,19వ తేదీల్లో నిర్వహించనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ జమదగ్ని మహర్షిల కళ్యాణం మహోత్సవంలో సిద్ధోగం లో భాగంగా ఈరోజు శ్రీ ఎల్లమ్మ తల్లి వారి ఉత్సవ విగ్రహం మరియు గడపవనం మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జిందం కళ చక్రపాణి గారి ఇంటికి రాగా వారు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవ విగ్రహానికి ఘన స్వాగతం పలుకుతూ వారి ఇంట్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి గారు, ముదిరాజ్ సంఘం సిరిసిల్ల అధ్యక్షులు వంకాయల కార్తీక్ గారు, మండపల్లి గ్రామం పెద్దలు బండి భూమయ్య, గుర్రపు మల్లేశం, వెంకట నరసయ్య మొదలగు వారు పాల్గొన్నారు...

## అత్యవసర సేవల సిబ్బందికి ఆలస్యంగా జీతాలు..

### - ప్రభుత్వం స్పందించాలని 108 ఉద్యోగుల విజ్ఞప్తి



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర వైద్య సేవలైన 108 అంబులెన్స్ సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొంతకాలంగా జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగుల కుటుంబాలు మానసిక ఆందోళనకు గురవుతున్నాయి.పగలు రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో ప్రజలకు సేవలందిస్తూ ప్రాణాలను రక్షిస్తున్న 108 ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు ఆలస్యంగా రావడంతో పిల్లల చదువులు, ఇళ్ల అద్దెలు, బ్యాంకు రుణాలు, ఇతర కుటుంబ అవసరాలు తీర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉద్యోగులు తెలిపారు.అత్యవసర వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న 108 ఉద్యోగుల్లో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారాని,జీతాలు సకాలంలో అందితే మరింత ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని వారు పేర్కొంటున్నారు.ప్రభుత్వం తరఫున 108 సేవల నిర్వహణ సంస్థకు విడుదల కావలసిన నిధులు ఆలస్యంగా అందుతున్నందునే ఈ పరిస్థితి ఏర్పడిందని,దీంతో ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడం కష్టంగా మారింది.ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 108 ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### బాధితులను పరామర్శించిన చల్మెడ

మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తోపారపు కమల ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చల్మెడ ఆసుపత్రిలో చేరగా వారిని శనివారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడలక్ష్మీనరసింహారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

## మునగ, పండ్ల చెట్లను నర్సరీల్లో సిద్ధం చేయాలి..



### గృహ అవసరాలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :గృహ అవసరాలకు సైతం ఉపయోగపడే మొక్కలను నర్సరీల్లో పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల లోని సాయి నగర్, జేపీ నగర్ ప్రాంతాల్లో సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కల రకాల సంఖ్య, వాటి పరిమాణం వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీ మొత్తాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, మున్సిపల్ నర్సరీల్లో రోడ్ల వెంట నాటేందుకు ఉపయోగించే మొక్కలతో పాటు గృహ వినియోగానికి ఉపయోగపడే మొక్కలను కూడా పెంచాలని సూచించారు. ముఖ్యంగా మునగ, పండ్ల చెట్లు మరియు ఇతర ఉపయోగకరమైన మొక్కలను నర్సరీల్లో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.ఎండాకాలం నేపథ్యంలో మొక్కలకు సమయానికి నీరు అందిస్తూ వాటిని సంరక్షించాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రణాళిక ప్రకారం మొక్కలను సిద్ధంగా ఉంచాలని అన్నారు.ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పత్రికలతో ప్రజల మధ్య బంధం కట్టిన సామాన్యుడు

-సిరిసిల్ల ఉదయాన్ని ఆరంభించే “రవన్న”..

-పాత బస్టాండ్ నుంచి ఐదు దశాబ్దాల సేవ

-సామాన్యుడి సేవ... అసామాన్య గుర్తింపు

-సిరిసిల్ల చరిత్రను చూసిన పత్రికల రవి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:మీరు ఎప్పుడైనా సిరిసిల్ల పాత బస్టాండ్‌కి వెళ్లారా? అక్కడ ఒక సాధారణమైన, సాధాసీదా మనిషి మీకు తప్పకుండా కనిపిస్తాడు. తెల్లవారుజామున చీకట్లను పారద్రోలుతూ వెలుగు రేఖలు వెదజల్లినట్టే అక్షరాల రూపంలో సమాచారాన్ని ప్రజలకు అందించే దినపత్రికలను చిరునవ్వుతో అందించే వ్యక్తిను నుగొండ రవీందర్.ఉదయం నాలుగు గంటల నుంచే తన దినచర్యను ప్రారంభించే రవి, మధ్యాహ్నం వరకు పాఠకులకు దినపత్రికలను అందించడం తన బాధ్యతగా భావిస్తాడు. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఇదే సేవను కొనసాగిస్తున్న ఈ సామాన్యుడు అందరికీ ఆప్యాయంగా “రవన్న”గా పరిచయం. వయోభేదం లేకుండా అందరితో ఆత్మీయంగా మెలిగే రవీందర్ గురించి తెలుసుకోవడం అంటే సిరిసిల్లలో జరిగిన ఐదు దశాబ్దాల పరిణామాలను తడిమి చూసినట్టే.

### కాలంతో పాటు మారిన సిరిసిల్ల... సాక్షిగా రవి

సిరిసిల్ల ప్రాంతం గత ఐదు దశాబ్దాల్లో ఎన్నో మార్పులను చూసింది. ఒకప్పుడు తాలూకా పరిధిలో ఉన్న సిరిసిల్ల, తరువాత డివిజన్‌గా, అనంతరం జిల్లాగా అభివృద్ధి చెందింది. ఈ మార్పులన్నింటికీ నిశ్శబ్ద సాక్షిగా నిలిచింది సిరిసిల్ల పాత బస్టాండ్... అలాగే రవి జీవితం.1978 నుంచి దినపత్రికలను విక్రయిస్తూ వస్తున్న రవి, బస్సుల ద్వారా పత్రికలు చేరే రోజుల నుంచి ఈరోజు డిజిటల్ యుగం వరకు జరిగిన మార్పులను తన కళ్లారా చూశాడు. కేవలం పత్రికల విక్రేతగానే కాకుండా, తన పరిధిలో ప్రజలకు సాధ్యమైనంత సేవలు అందిస్తూ అందరి అభిమానాన్ని సంపాదించాడు.





**పాత బస్టాండ్ జ్ఞాపకాలు..**ఇప్పటి తరానికి కనిపిస్తున్న పాత బస్టాండ్ రూపం ఒకప్పుడు అలా ఉండేది కాదు. పెద్ద వేపచెట్టు, సిమెంట్ వాటర్ ట్యాంక్, పరుచుకున్న టెలాలు, తరువాత ఏర్పడిన వసంత్ విహార్ హోటల్--- ఇవన్నీ పాత తరానికి గుర్తుండే జ్ఞాపకాలు. ప్రయాణికులకు కేంద్రంగా నిలిచిన ఆ బస్టాండ్ మధ్యలో దినపత్రికలు, పత్రికలు విక్రయించే బుక్ స్టాల్ కూడా ఉండేది.తరువాత మున్సిపల్ సహకారంతో బస్టాండ్ కాంప్లెక్స్ నిర్మాణం జరిగి ప్రస్తుతం కనిపిస్తున్న రూపు దాల్చింది. ఈ మార్పులన్నింటితో పాటు సిరిసిల్లలో ప్రారంభమైన తొలి తరపు పాత్రికేయులతో రవి జీవితం విడదీయరాని బంధంగా కొనసాగింది.

**పాత్రికేయులతో ఆత్మీయ బంధం**

సిరిసిల్ల తొలి తరపు పాత్రికేయులు మాగంటి భాస్కర్, భద్రాచలం, తడక విశ్వనాథం, మచ్చ ఆనంద్, తౌటు నాగభూషణం వంటి వారితో మొదలైన పరిచయాలు, తరువాత క్రాంతి ప్రకాష్ శుక్ల, టి.వి. నారాయణ, మల్లికార్జున్, రాపెల్లి సంతోష్, జయంత్ తదితరులతో కొనసాగాయి. ఈ పాత్రికేయులందరితో పూలదండలో దారంలా మిళితమై ఉన్నది రవి జీవితం.రవి చేస్తున్న సేవను గుర్తించి 1980లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అతనికి ఎస్టీడీ బూత్ ఏర్పాటు చేసి ఇచ్చారు. 1989 వరకు అది ఉపాధిగా కొనసాగినా, తరువాత పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. అయినప్పటికీ రవి తన సేవలను కొనసాగిస్తూ అందరి ఆదరణను పొందుతున్నాడు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు జీవగడ్డ విజయ్ కుమార్, దేవులపల్లి అమర్ వంటి ప్రముఖులు కూడా రవిని గుర్తించి పలకరించేవారని ఆయన చెబుతాడు. పద్మపీఠం ఎడిటర్ కొక్కుల భాస్కర్ వంటి వారి ఆత్మీయత ఇప్పటికీ కొనసాగుతోందని రవి పేర్కొంటాడు.

**చిరునవ్వుతో పలకరించే రవన్న**

కాలంతో పాటు సాగుతున్న ఐదు దశాబ్దాల జీవన ప్రయాణంలో సిరిసిల్ల పాత బస్టాండ్‌తో రవికి విడదీయరాని బంధం ఏర్పడింది. మనుషులతో అతనికి ఉన్న ఆత్మీయతే అతని ప్రత్యేకత.ఎప్పుడైనా పాత బస్టాండ్‌కు వెళ్లినప్పుడు పత్రికలు మాత్రమే కాదు, వాటిని అందిస్తూ చిరునవ్వుతో పలకరించే “రవన్న” కనిపిస్తాడు. అతని పలకరింపులోని ఆప్యాయత సిరిసిల్ల చరిత్రను, కాలంతో వచ్చిన మార్పులను గుర్తు చేస్తుంది.సామాన్యుడైన రవితో చేసే సంభాషణ, నిజానికి సిరిసిల్లతో మాట్లాడినట్టే అనిపిస్తుంది.

# పేదల వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట..

### -ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :నిరుపేదల వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు . శనివారం ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ లో గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, “గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యసేవలు చేరుస్తున్నామని అన్నారు . ఈ శిబిరాలను మరింత విస్తరింపజేస్తూ, మారుమూల గ్రామాల వారికి వైద్య సేవలు అందిస్తున్నాం” అని తెలిపారు., బీఆర్ఎస్ హయాంలో పేదల వైద్యం పట్ల పూర్తిగా నిర్లక్ష్యముగా వ్యవహరించిందని అన్నారు. రేవంత్ రెడ్డి సర్కారు ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు మాత్రమే కాక, అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడం, ఖాళీ డాక్టర్ పోస్టులను భర్తీ చేయడం, వైద్యేతర సిబ్బందిని నియమించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నదన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడంలో వైద్య శిబిరాలు ముఖ్యపాత్ర వహిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ జీవన, ఇల్లంతకుంట





మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జి.వసంత-నర్సయ్య, పార్టీ నాయకులు ఊట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎల్లందుల ప్రసాద్, రాజేందర్ రెడ్డి, నవీన్ రెడ్డి, పసుల వెంకటి, మామిడి రాజు తదితరులు పాల్గొన్నారు.

### నూతన అంగన్వాడీ కేంద్రాలకి భూమిపూజలు

వల్లంపట్ల గ్రామంలో నూతనంగా నిర్మించబడిన అంగన్వాడీ కేంద్ర భవనానికి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు కాంపెల్లి నాగరాజు, నేరెళ్ల విజయ్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్, మాజీ ఎంపీపీలు ఉట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య, మరియు పార్టీ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, ఎలగందుల ప్రసాద్, పసుల వెంకటి, కాత మల్లేశం, మామిడి రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈరోజు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గౌరవ జిల్లా కలెక్టర్ గారిమ అగర్వాల్ గారు మరియు మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి గారు మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలను పరిశీలించి నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు నర్సరీలో మొక్కలకు అవసరాన్ని బట్టి నీళ్లు పడుతూ జాగ్రత్తగా చూసుకోవాలని స్వచ్ఛత నియమాలను పాటించాల్సిందిగా సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్వర్లు గారు, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాష గారు కౌన్సిలర్ సభ్యులు ఆడెపు చంద్రకళ గారు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు...

# ముందు హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేయండి

### ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, మార్చి 14:
మూసీ నది కంటే ముందు హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. హుస్సేన్‌సాగర్ నీటిని కొబ్బరి నీళ్లలా మారుస్తానని, ఆ నీళ్లను రాత్రి పూట ఎందులోనైనా కలుపుకోవచ్చంటూ మాజీ సీఎం కేసీఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలను రాంచందర్ రావు గుర్తు చేశారు. హుస్సేన్‌సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లలా కాకపోయినా కనీసం మంచినీటిగానైనా మార్చాలని సీఎం రేవంత్‌కు వినతి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వల్ల ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులు తెలియజేసేందుకు బీజేపీ రూపొందించిన ‘ఇగ సహించదు తెలంగాణ – సేవ్ తెలంగాణ’ పోస్టర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... మూసీ నది కంటే ముందు హుస్సేన్‌సాగర్‌ను ప్రక్షాళన చేయాలని అన్నారు. హుస్సేన్ సాగర్‌లో పారిశ్రామిక వ్యర్థాలు, మురుగునీరు కలుస్తూనే ఉన్నాయన్నారు. మురుగునీటిని శుద్ధి చేసే ప్లాంట్‌లు కూడా పని చేయడం లేదని తెలిపారు. మూసీలో కలుస్తున్న కలుషిత జలాలను ఎలా నిలువరిస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు వంద ఎకరాలు అవసరమా? హైదరాబాద్ నగరాన్ని చూడ్డానికి గాంధీ విగ్రహం వద్దకు వెళ్లాలా? అందుకోసం వేలాది ఇళ్లు కూల్చివేయాలా? అని నిలదీశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై



నిరంతర పోరాడటమే తమ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. దేశంలో గ్యాస్ కొరత ఏ మాత్రం లేదని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేసినా కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తోందని రాంచందర్‌రావు మండిపడ్డారు. దేశవ్యాప్తంగా రోజువారీ గ్యాస్ డిమాండ్ 55 లక్షల సిలిండర్లు కాగా, కాంగ్రెస్ సృష్టించిన భయాందోళన వల్ల 76 లక్షలకు పెరిగిందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేయడమే కాంగ్రెస్ లక్ష్యమని విమర్శించారు.

# రైతులు వరి సాగు చేయొద్దు..


### మంత్రి తుమ్మల వెల్లడి

### వడ్లు కొనబోమంటున్న కేంద్రం

### ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

### 22న నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

హైదరాబాద్, మార్చి 14: ‘తెలంగాణ నుంచి వడ్లు కేంద్రం కొనేపరిస్థితి లేదు. బియ్యం ఇక నుంచి కొనుగోలు చేయబోం. ఇక మీ ఇష్టం’ అని కేంద్ర ప్రభుత్వం నిక్కచ్చిగా చెప్పిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట మార్పిడి పాటించకపోతే రైతులు భవిష్యత్తులో బాగా నష్టపోతారని



పేర్కొన్నారు. వరి వేస్తే నీటి సమస్యతోపాటు వడగండ్ల వర్షాలతో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు చెప్పారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఉద్యాన, వాణిజ్య పంటలు వేసుకోవాలని, వరి మాత్రం సాగు చేయొద్దని సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయిల్‌ఫెడ్ అధికారులతో కలిసి తుమ్మల పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి రాష్ట్రం నలుమూలల నుంచి రైతులు వస్తారని, మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తామని చెప్పారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలోనే వరి సాగు అవుతుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఎప్పుడు ఇంత వరి పండిన సందర్భం లేదని, పంజాబ్ లోనూ వరి ఇంతగా లేదని పేర్కొన్నారు. వరి వేయడం వల్ల అందరికి కష్టాలు తెచ్చే పరిస్థితి వస్తుందని తెలిపారు. అందుకే పంటల మార్పిడి తప్పనిసరి అని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో ఆయిల్‌పామ్ తప్ప మరో పంట లేదని చెప్పారు. అర్జెంట్‌గా ఇంత ఆదాయం వచ్చే మరో పంట లేదని పేర్కొన్నారు. నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఈనెల 22న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు మంత్రి తుమ్మల తెలిపారు. ఏప్రిల్ నుంచి సీజన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఉత్తర తెలంగాణతోపాటు మిగతా జిల్లాల నుంచి వచ్చే పంట మొత్తం నర్మెట ఫ్యాక్టరీకే రావాల్సి ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో పండే ప్రతి గెలా నష్టపోకుండా ప్రాసెస్ చేసే విధానం ఇక్కడ ఉన్నదని తెలిపారు. తెలంగాణలో క్రూడాయిల్ ఉన్నప్పటికీ రిఫైండ్ లేదని, సీఎంను అడిగి రిఫైండ్ కూడా ఇక్కడే ఏర్పాటు చేసుకోబోతున్నామని చెప్పారు. అదేరోజు దానికి భూమి పూజ చేస్తామని వెల్లడించారు.

# ఆందోళన కలిగించే విషయమే..



- ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై కేంద్రప్రభుత్వం

హైదరాబాద్, మార్చి 14: దేశంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా ఆందోళన చెందాల్సిన అంశంగా మారిందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అంగీకరించింది. "మన దిగుమతుల్లో ఎక్కువ భాగం హోర్ముజ్ జలసంధి నుంచే వస్తాయి. అందుకే ఎల్పీజీ సరఫరా విషయం మాకు ఆందోళన కలిగిస్తోంది" అని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ (మార్కెటింగ్ అండ్ ఆయిల్ రిఫైనరీ) అన్నారు. అయితే, ఎల్పీజీ స్టాక్ పూర్తిగా అయిపోయినట్లు దేశవ్యాప్తంగా ఉన్న 25 వేల మంది (గ్యాస్) డిస్ట్రిబ్యూటర్లలో ఎవరి దగ్గర్నుంచీ తమకు నివేదిక ఏదీ రాలేదని ఆమె పేర్కొన్నారు. కొరత భయంతో ప్రజలు గ్యాస్ సిలిండర్లను అవసరం లేకపోయినా బుక్ చేస్తున్నారని ఆమె గణాంకాలతో సహా వివరించారు. "రోజుకు సగటున 55.7 లక్షల సిలిండర్లు బుక్ అయ్యేవి. కానీ, యుద్ధం మొదలయ్యాక బుకింగ్‌ల సంఖ్య పెరిగింది. మార్చి 12న 75.7 లక్షల బుకింగ్‌లు నమోదయ్యాయి. ఇది ప్యానిక్ బుకింగ్ (ఆందోళనతో చేసే బుకింగ్) తప్ప మరేం కాదు" అని ఆమె పేర్కొన్నారు. చమురు సంస్థలు రోజుకు 50 లక్షల సిలిండర్లను సరఫరా చేసేవని.. ఇప్పుడు కూడా అదే సంఖ్యను కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఎల్పీజీ కొరత ఉందంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దన్నారు. పైప్డ్ నేచురల్ గ్యాస్ అందుబాటులో ఉన్నవారు ఎల్పీజీ నుంచి ఆ గ్యాస్‌కు మారాలని ఆమె సూచించారు. దేశంలో 60 లక్షల కుటుంబాలకు అలా ఎల్పీజీ నుంచి పైప్డ్ గ్యాస్‌కు మారే వీలు ఉందని సుజాత శర్మ పేర్కొన్నారు.

# క్రెచ్ వర్కర్ల వేతనాలను పెంచండి



- కేంద్ర మంత్రి అన్నపూర్ణదేవికి మంత్రి సీతక్క వినతి

హైదరాబాద్, మార్చి 14: శిశు సంరక్షణ కేంద్రాలలో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్ల వేతనాలను పెంచాలని కేంద్ర మహిళ, శిశు సంక్షేమ మంత్రి అన్నపూర్ణదేవికి రాష్ట్ర మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. శనివారం, కేంద్ర మంత్రి అన్నపూర్ణా దేవితో ఆమె నివాసంలో మంత్రి సీతక్క భేటీ అయ్యారు. ప్రస్తుతం క్రెచ్‌వర్కర్లకు ఒక్కొకరికి నెలకు రూ.5,500, హెల్పర్లకు రూ.3 వేలుగౌరవ వేతనంగా ఇస్తు న్నారని.. ఇది వారు చేసే పనికి, బాధ్యతలకు ఏమాత్రం సరిపోదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, నిర్భయ నిధి కింద కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఇన్‌క్లూజివ్ సిటీస్ ఫర్ విమెన్ అండ్ గర్ల్స్' కార్యక్రమం కింద తెలంగాణ నుంచి ములుగు జిల్లాను ఎంపిక చేయడం పట్ల కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ములుగులో ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు అవసరమైన డీపీఆర్ రూపకల్పనలో.. జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని తెలిపారు.

# 10 బాలిస్టిక్ మిస్సైల్స్‌ను ప్రయోగించిన ఉ.కొరియా

**జపాన్ సముద్ర జలాల్లో పడిన మిస్సైల్స్!**



ప్యాంగ్యాంగ్, మార్చి14: పశ్చిమాసియాలో యుద్ధం పతాక స్థాయికి చేరిన వేళ మరో టెన్షన్ మొదలైంది. ఉత్తర కొరియా శనివారం జపాన్ సముద్ర జలాల్లోకి 10 బాలిస్టిక్ మిస్సైల్స్ ప్రయోగించింది. జపాన్ సముద్ర జలాల్లో అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలకు సమాధానంగా..ఉత్తర కొరియా ఈ చర్యకు దిగినట్టు వార్తలు వెలువడ్డాయి.శనివారం తమ దేశ సముద్ర జలాల్లోకి ఉత్తర కొరియా వరుసగా 10 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించిందని, జపాన్ ఆర్థిక మండలి వెలుపల ఒక మిస్సైల్ పడిపోయినట్టు ఆ దేశ ప్రభుత్వ మీడియా 'ఎన్‌హెచ్‌కే' పేర్కొన్నది. తమ దేశ తూర్పు తీర సముద్ర జలాల్లోకి ఉత్తర కొరియా మిస్సైల్స్ ప్రయోగించినట్టు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్రకటనలో తెలిపారు. అమెరికా, దక్షిణ కొరియా సంయుక్త సైనిక విన్యాసాలు పూర్తిగా రక్షణాత్మకమైనవిగా చెబుతున్నప్పటికీ, ఈ చర్యలను ఉత్తర కొరియా తీవ్రంగా ఖండిస్తున్నది.

# రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

హైదరాబాద్, మార్చి 14: పార్లమెంటు ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ప్రజాస్వామ్యాన్ని అవమానించారంటూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ నిబంధనలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు పార్లమెంట్ భవనం మెట్లపై కూర్చొని టీ తాగుతూ, పిక్నిక్ స్పాట్ లా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమన్నారు. కాగా, మహేశ్వరం నియోజకవర్గం నుంచి వివిధ ఫెడరేషన్ల కార్యకర్తలు రాంచందర్‌రావు సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు.

# మూసీ ముసుగులో లక్షన్నర కోట్ల లూటీకి స్కెచ్..

- సీఎంకు విజన్‌లేదు..తెలిసింది రియల్‌ఎస్టేట్ దందానే : హరీశ్‌రావు



హైదరాబాద్, మార్చి 14: గల్ఫ్‌లో బాంబులతో అమెరికా, తెలంగాణలో యుద్ధం లేకున్నా బుల్డోజర్లతో రేవంత్ సర్కార్ పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను ధ్వంసం చేస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'మూసీ ముసుగులో సీఎం రేవంత్‌రెడ్డి లక్షన్నర కోట్ల లూటీకి తెరలేపిన్రు. ఓవైపు రాష్ట్ర ఖజానా ఖాళీ అంటూనే మరోవైపు ప్రజాధనాన్ని కొల్లగొట్టేందుకు టెండర్ పెట్టిండు. పేదల పక్కా ఇండ్లు కూల్చి ఫైవ్‌స్టార్ హోటల్‌లో ప్రజెంటేషన్ ఇస్తున్నడు. తుగ్లక్ తరహా పాల నతో తెలంగాణను అధోగతి పాల్జేస్తున్నడు.కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని విధ్వంసం చేసేందుకు కంకణం కట్టుకున్నడు. మూసీ ప్రక్షాళన పేరిట రేవంత్‌రెడ్డి చేస్తున్నది బ్యూటిఫికేషన్ కాదు.. పక్కా లూటిఫికేషన్' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మూసీ పునరుజ్జీవానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో పాల్పడుతున్న దోపిడీకి, పేదల ఇండ్లు కూల్చివేసి వేలాది మందిని నిరాశ్రయులుగా చేయడానికి తాము వ్యతిరేకమని తేల్చిచెప్పారు. మూసీ సుందరీకరణను ప్రారంభించింది బీఆర్ఎస్ సర్కారేనని స్పష్టం చేశారు.నాడు రూ.4 వేల కోట్లతో 32 ఎస్టీపీలు నిర్మించామని, గోదావరి జలాల తరలింపునకు ప్రణాళికలు తయారు చేశామని గుర్తుచేశారు.శుక్రవారం తెలంగాణభవన్‌లో ఎమ్మెల్సీ శంభీర్‌పూర్‌రాజు, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, వివేకానందగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఈ రోజు మూసీ బ్యూటిఫికేషన్‌పై ఫైవ్ స్టార్ హోటల్‌లో ప్రజెంటేషన్ ఇస్తున్న రేవంత్‌రెడ్డి, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా బాధితుల పక్షాన బీఆర్ఎస్ అడుగుతున్న ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

'మూసీ సుందరీకరణ..ప్రక్షాళన.. పునరుజ్జీవమని పూటకో పేరు మార్చుతూ రోజుకో చోట ప్రజల ఇండ్లు కూల్చే హక్కు ఎవరిచ్చారు? మూసీ అభివృద్ధి పేరిట విధ్వంసకాండ కొనసాగించడంలో ఔచిత్యమేంటి..?' అని ప్రశ్నించారు. ప్రక్షాళనపై చిత్తశుద్ధి ఉన్న వారెవరూ మొట్టమొదలే పేదల ఇండ్లపై పడరని, సమగ్ర ప్రణాళికల రూపకల్పన తర్వాతే ముందుకెళ్తారని చెప్పారు. 'వికారాబాద్ నుంచి హైదరాబాద్ వరకు మురుగు నీటిని ఆపకుండా ప్రక్షాళన ఎలా చేస్తావు రేవంత్‌రెడ్డీ? ముందుగా వికారాబాద్‌లో ఎస్టీపీ మరమ్మతుపై దృష్టిపెట్టు' అని చురకలంటించారు.

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్..



- 45 రోజుల తర్వాత ఏ క్షణమైనా సమ్మెకు వెళ్తాం..
- హెచ్చరించిన జేఏసీ

హైదరాబాద్, మార్చి 14: టీజీఎస్ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. ఈ మేరకు కార్మిక సంఘాల జేఏసీ నేతలు శుక్రవారం ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీస్ అందజేశారు. 45 రోజుల్లోగా తమ డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆలోగా ఏక్షణమైనా సమ్మెకు వెళ్తా మని ఆ నోటీస్‌లో హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ బస్‌భవన్ వద్ద జరిగిన సమావేశంలో కార్మిక జేఏసీ నేతలు మాట్లా డారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, వేతన సవరణలు చేపట్టాలని, యూనియన్లను పునరుద్ధరించాలని, ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నోటీస్ ఇచ్చామని ప్రకటించారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఇటు ఆర్టీసీ యాజమాన్యానికి, అటు రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేక విధిలేని పరిస్థితుల్లోనే సమ్మె నోటీస్ ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన 2017 వేతన సవరణ ఏరియర్స్ నేటివరకు చెల్లించలేదని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెం కన్న విమర్శించారు. ఆ వేతన సవరణలో జరుగాల్సిన అలవె న్సులు, ఫ్రింజ్ బెనిఫిట్స్ పెంచకపోవడం విచారకరమని పేర్కొ న్నారు. పాత అలవెన్సులే ఇవ్వడంతో ఆర్టీసీ కార్మికులకు ఆర్థి క నష్టం జరిగిందని తెలిపారు. 2017లో రిటైరైన కార్మికులకు ఫిక్సేషన్లు జరిగినా, నేటివరకు వారికి సెటిల్మెంట్ చేయలేదని తెలిపారు. 2021 వేతన సవరణలో 30 శాతం ఫిట్‌మెంట్‌తో ఆర్టీసీ కార్మికులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

# నిరుద్యోగుల నిరసన మార్చ్

- ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు..
- దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలో నిరుద్యోగుల మిలియన్ మార్చ్
- ఉద్యోగ నోటిఫికేషన్ల సాధనకు రెండోరోజూ కొనసాగిన ఆందోళన
- అడుగడుగునా పోలీసుల అణచివేత..నిరుద్యోగ యువత పోరుబాట
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహజ్వాల



హైదరాబాద్, మార్చి 14:
ఉద్యోగ నోటిఫికేషన్ల సాధన కోసం నిరుద్యోగ యువత వెనక్కి తగ్గడమే లేదు. మిలియన్ మార్చ్‌లో భాగంగా రెండోరోజైన శుక్రవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది తరలివచ్చిన నిరుద్యోగులు చైతన్యపురిలోని రోడ్డుపై మూకుమ్మడిగా ఆందోళనకు దిగారు. దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో పోలీస్ నిర్బంధాన్ని ఛేదించి ప్లకార్డులు చేతబూని యువత రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ దమనకాండపై ధ్వజమెత్తింది. రోడ్లపైకి వచ్చిన నిరుద్యోగులను ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు వ్యాన్లలో స్టేషన్లకు తరలించి నిర్బంధం కొనసాగించారు. అయినా విడతల వారీగా రోడ్లపైకి వచ్చి సర్కార్ వైఖరిపై నిరసన గళం విప్పారు. ఉద్యమాన్ని అణచివేసేందుకు సంస్థలు, హాస్టళ్ల వద్ద హెచ్చరికలు చేసిన పోలీసులు తాజాగా దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాన్ని దిగ్బంధం చేశారు. జాతీయ రహదారిపై దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్, చైతన్యపురి ప్రాంతాల్లో డీసీఎంలో పోలీసులు ఉదయం నుంచే పహారా కాశారుజాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రతి కాలనీ వీధి వద్ద పోలీసులు మోహరించి మరీ రోడ్లపైకి నిరుద్యోగులు రాకుండా అడ్డుకొనేందుకు విఫలయత్నం చేశారు. అయినా నిరుద్యోగులు రోడ్లపైకి నినాదాలు చేస్తూ తమ నిరసన గళాన్ని వినిపించారు. చైతన్యపురిలో ఒక్కసారిగా రోడ్లపైకి పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరి నినాదాలు చేయడంతో పోలీసులు మూకుమ్మడిగా వారిని అరెస్టు చేశారు. తెలంగాణ బీఈడీ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య కుమార్, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు ఇంద్రకుమార్‌నాయక్, వినాయక్ కుమార్‌తోపాటు శంకర్, ఆకాశ్, శింబు, అశోక్, ఆస్మా, వినయ్, మహేందర్, భారత్, సోమేశ్‌యాదవ్ నేతృత్వంలో చైతన్యపురి చౌరస్తా ప్రాంతానికి సుమారు 300 మంది నిరుద్యోగ విద్యార్థులు ఒక్కసారిగా చేరుకొని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని, వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించాలంటూ వారు డిమాండ్ చేశారు. జీవో 46, 29ని వెంటనే రద్దు చేయాలని నినాదాలు చేశారు. చైతన్యపురి పోలీసులు నిరుద్యోగ జేఏసీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మిగతా యువతను చెదరగొట్టారు.

# ఆందోళనతో దిగొచ్చిన అగ్రి వర్సిటీ

- విద్యార్థుల ఉపకార వేతనాలు పెంచేందుకు హామీ



హైదరాబాద్, మార్చి 14:
విద్యార్థుల ఆందోళనకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం యాజమాన్యం దిగివచ్చిం ది. వర్సిటీలో రెండు రోజులుగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు తమకు పెంచి న స్టైపెండ్‌ను ఆగస్టు నెల నుంచి అమలు చేయాలని నిరవధిక దీక్షకు దిగారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో శుక్రవారం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమస్యను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. పీజీ విద్యా ర్థుల స్టైపెండ్ నెలకు రూ. 12వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.15వేలు వర్సిటీ పాలక మం డలి ఆమోదించిందని మంత్రికి వివరించారు. ఉపకులపతి ఇచ్చిన హామీతో విద్యార్థులు నిరవధిక దీక్షను విరమించారు. దీంతో వీసీ విద్యార్థులకు మజ్జిగ అందించి దీక్ష విరమింపజేశారు.

# మెదక్ జిల్లా దవాఖానలో ఏసీబీ తనిఖీలు



మెదక్,మార్చి 14 :మెదక్ జిల్లా దవాఖానలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ..మెదక్ జిల్లాసర్కార్ దవాఖానలో పనిచే స్తున్న సిబ్బంది లతీఫ్ ముజుద్దీన్ మెడికల్ ఫీజ్ రీయిం బర్స్‌మెంట్‌కు సంబంధించిన 1,000కి పైగా బిల్లులు పెండిం గ్‌లో ఉంచారని, 100 బిల్లులు మాత్రమే చెల్లించి, పలువురిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని వచ్చిన సమాచారంతో దాడులు చేసి రికార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొ న్నారు. బిల్లులు పెండింగ్‌లో ఎందుకు పెట్టారో పూర్తివిచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు . ఇక్కడి సూప రింటెండెంట్ సెపట్టెంబర్‌లో 116 బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్టు తెలిసిందన్నారు. 282 బిల్లులు తన వద్ద ఉంచుకుని రికార్డులో నమోదు చేయలేదని వెల్లడించారు.తెలంగాణ వార్తాపత్రిక

# నేరాల కట్టడికి సైబర్ సింబా

- వినూత్న కార్యక్రమానికి



## సిటీ పోలీసుల శ్రీకారం


హైదరాబాద్, మార్చి 14:
సైబర్ నేరగాళ్ల మాయలో పడి సర్వస్వాన్ని కోల్పోతున్న అమాయకులను కాపాడుకుంటూ సమాజంలో సైబర్‌నేరాలపై ప్రజలను అప్రమత్తం చేసేలా ప్రతిపౌరుడు చొరవ తీసుకోవాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ పిలుపునిచ్చారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టడంలో వలంటీర్ల పాత్రే కీలకమన్న సజ్జనార్ సోషల్‌మీడియా వినియోగంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో కేవలం గుడ్‌మార్నింగ్, గుడ్‌నైట్ మెసేజ్‌లకే పరిమితం కాకుండా సైబర్ నేరాల అవగాహన సందేశాలను షేర్ చేయాలని సూచించారు.హైదరాబాద్ నగరాన్ని సైబర్ నేర రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీసు శాఖ సైబర్ సింబా పేరుతో ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ వేదికగా జరిగిన ఓరియేంటేషన్ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పాల్గొని వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. జాగృత్ హైదరాబాద్-సురక్షిత్ హైదరాబాద్ ప్రచారంలో భాగంగా ప్రజల్లో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని, ఈ క్రమంలో పోలీసులతో కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చిన స్వచ్ఛంద సేవకులను సైబర్ సింబాగా వ్యవహరిస్తామని సజ్జనార్ తెలిపారు.

# నీటి సంఘాలను ఏర్పాటుచేయాలి : రైతు కమిషన్

హైదరాబాద్, మార్చి 13: రాష్ట్రంలో మేజర్ ఇరిగేషన్ నుండి మైనర్ ఇరిగేషన్‌ను విడదీసి చెరువులను అభివృద్ధి చేయాలని రైతు కమిషన్ పేర్కొన్నది. ఈ మేరకు ఇప్పటికే కమిషన్ ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది. తాజాగా శుక్రవారం చెరువుల అభివృద్ధి, నీటి సంఘాల ఏర్పాటుతోపాటు ఇతర అంశాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో సమావేశమై చర్చించింది. నీటి సంఘాలను ఏర్పాటుచేసి చెరువుల నిర్వహణ బాధ్యత అప్పగించాలని కోరింది. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.రాష్ట్రంలో చిన్న నీటిపారుదల పునర్వ్యవస్థీకరణ కోసం రైతు కమిషన్ ఆధ్వర్యంలో వేసిన కమిటీ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా మంత్రికి కమిషన్ బృందం అందజేసింది. చెరువుల అభివృద్ధి, పరిరక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి.. త్వరలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో కమిషన్ సూచించిన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.తెలంగాణ వార్తాపత్రిక సమావేశంలో పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, చెవిటి వెంకన్న, భవానీరెడ్డి, భూమి సునీల్, కమిషన్ సెక్రటరీ గోపాల్‌తోపాటు ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ, నీటిపారుదల రంగాల నిపుణులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

# ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాతలకు బిగ్ రిలీఫ్

## ఏకంగా సుప్రీం కోర్టు స్టే




పవన్ కల్యాణ్ నటిస్తోన్న సినిమా.. ఉస్తాద్ భగత్ సింగ్. హైఓల్టేజ్ యాక్షన్ మూవీ ఇది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. హరీష్ శంకర్ దర్శకుడు. మైత్రీ మూవీస్ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ఈ సినిమాను నిర్మించారు. శ్రీలీల హీరోయిన్. అశుతోష్ రాణా, నవాబ్ షా, అవినాష్, గౌతమి కీలక పాత్రల్లో నటిస్తోన్నారు. తమిళంలో విజయ్ నటించిన థేరి సినిమాకు రీమేక్ ఇది. దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా ఈ నెల 19న విడుదల కాబోతోన్న ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు బిగ్ రిలీఫ్ దక్కింది. సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు సంబంధించిన అంశంపై సుప్రీంకోర్టు స్టే జారీ చేసింది. టిక్కెట్ ధరల పెంపునకు అనుమతించే ఏ నిర్ణయాన్నైనా సినిమా విడుదల కావడానికి 90 రోజుల ముందే ప్రకటించాల్సి ఉంటుందని తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. దీంతో టిక్కెట్ల ధరల ఆమోదాలకు సంబంధించి ప్రస్తుత విధానమే కొనసాగుతుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు తెలంగాణలో విడుదలయ్యే అన్ని చిత్రాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని, ఈ విషయంలో తక్షణ జోక్యం అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పిటీషన్ తరఫు న్యాయవాదుల వాదనలతో ఏకీభవించింది. హైకోర్టు ఉత్తర్వులను మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, నిరంజన్ రెడ్డి తమ వాదనలు వినిపించారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశం రాష్ట్రవ్యాప్తంగా సినిమా విడుదలలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. సినిమా విడుదల కావడానికి 90 రోజుల ముందు టిక్కెట్ ధరల పెంపుదల నిర్ణయాలను బహిర్గతం చేయాలనే హైకోర్టు నిబంధనకు ప్రాతిపదిక ఏమిటని పిటిషనర్ తరపు న్యాయవాదులు ప్రశ్నించారు. సినిమా వచ్చే వారం విడుదల అవుతోన్నప్పుడు 90 రోజుల ముందే డిస్ క్లోజ్ చేయడం అనేది ఎలా సాధ్యపడుతుందని, మొత్తం సినిమాలే 90 రోజుల్లోపే తీస్తోన్నారని న్యాయవాదులు వాదించారు. బాధిత పక్షాలను వాదనలను వినకుండానే హైకోర్టు ఇతర సందర్భాలలో కూడా ఇలాంటి తాత్కాలిక ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు మూడు వేర్వేరు కేసులలో మూడు ఇలాంటి ఆదేశాలను ఇచ్చారని, మధ్యంతర ఉత్తర్వు ద్వారా ఇలా చేయలేరని, పేర్కొన్నారు. వాదనలను విన్న అనంతరం సుప్రీంకోర్టు బెంచ్ స్టే మంజూరు చేసింది.

# టాలీవుడ్‌లో మరో విషాదం..

# ప్రముఖ నిర్మాత ఎం.అర్జున రాజు కన్నుమూత





తెలుగు సినీ పరిశ్రమలో ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన ప్రముఖ నిర్మాత, రోజా ఆర్ట్స్ అధినేతల్లో ఒకరైన ఎం. అర్జున రాజు అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణం టాలీవుడ్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. సినీ పరిశ్రమకు విశేష సేవలు అందించిన అర్జున రాజు మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు, సంస్థలు సంతాపం వ్యక్తం చేస్తున్నాయి. ఎం. అర్జున్ రాజు ప్రముఖ నిర్మాణ సంస్థ రోజా ఆర్ట్స్ ద్వారా అనేక చిత్రాలను నిర్మించారు. నిర్మాత శివరామరాజుతో కలిసి ఆయన నిర్మించిన "కొండవీటి సింహం", "వేటగాడు" వంటి సినిమాలు అప్పట్లో భారీ విజయాలను సాధించాయి. ఈ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు టాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపును కూడా తెచ్చాయి. ఇక రోజా ఆర్ట్స్‌తో పాటు రోజా ఆర్ట్ ప్రొడక్షన్స్, రోజా ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై కూడా ఆయన పలు చిత్రాలను నిర్మించి నిర్మాతగా తన ముద్ర వేశారు. సినిమాల నిర్మాణంలో నిబద్ధత, ప్రొఫెషనల్ ధోరణితో పనిచేసే నిర్మాతగా ఆయనకు పరిశ్రమలో మంచి పేరు ఉంది. ఆయన మృతి సినీ ఇండస్ట్రీకి తీరని లోటు అని పలువురు కామెంట్ చేస్తున్నారు. ఇక అర్జున రాజు అంత్యక్రియలు మార్చి 14, 2026న హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలి పారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు, సన్నిహితులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. అర్జున రాజు మృతి పట్ల ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు భగవంతుడు తగిన మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించింది. అలాగే ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ మరియు తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి కూడా ఆయన మరణంపై విచారం వ్యక్తం చేశాయి. అర్జున రాజు నిర్మించిన చిత్రాలను గుర్తుచేసుకుంటూ, ఆయనను నిబద్ధతతో పనిచేసే నిర్మాతగా కొనియాడాయి. ఈ సందర్భంగా శోకసంద్రంలో ఉన్న ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. ప్రముఖ నిర్మాతగా తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేసిన అర్జున రాజు మృతి టాలీవుడ్‌కు తీరని లోటుగా సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# షాహిద్‌కి జోడిగా రష్మిక..



## 'కాక్‌టెయిల్ 2' ఫస్ట్ లుక్ వచ్చేది అప్పుడే.!

బాలీవుడ్ సెన్సేషనల్ హిట్ 'కాక్‌టెయిల్' (2012) చిత్రానికి చాలా ఏండ్ల గ్యాప్ తర్వాత సీక్వెల్ సిద్ధమవుతోంది. మడాక్ ఫిలింస్ అధినేత దినేష్ విజన్ నిర్మాణంలో 'కాక్‌టెయిల్ 2' అంటూ రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో షాహిద్ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా.. ఈ సినిమాను హోమీ అదాజానియా దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను మార్చి 18న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. మార్చి 18న 'ధురంధర్ ది రివెంజ్' సినిమా ప్రీమియర్స్ ప్రదర్శించబోతుండగా ఈ సినిమాతో కలిపి ఈ ఫస్ట్ లుక్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. అంతేకాకుండా, ఈ చిత్ర విడుదలకు కూడా ముహూర్తం ఖరారు చేస్తూ జూన్ 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది.






## నిర్మాతలకు ఊరట.. 90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

టికెట్ రేట్లు పెంచుకునే విషయంలో తెలుగు నిర్మాతలకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమాల టికెట్ రేట్ల పెంపుపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. సినిమా విడుదలకు 90రోజులకు ముందే ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలనే హైకోర్టు ఆదేశాలపై తాజాగా సుప్రీంకోర్టు స్టే విధించింది. జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయాన్ని వెలువరించింది. దీంతో త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న అగ్ర హీరోల చిత్రాలకు ఊరట లభించింది. గతంలో మాదిరిగానే ప్రీమియర్స్‌తో పాటు టికెట్ రేట్లను పెంచుకునేందుకు వెసులుబాటు లభించింది. ఇకపై టికెట్ ధరల పెంపు కోసం సాధారణ పద్ధతిలోనే నిర్మాతలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకునే వీలు కలిగింది. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం కీలక ఆదేశాలను జారీ చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులతో పవన్‌కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా టికెట్ రేట్ల పెంపునకు మార్గం సుగమమైంది.




హరీశ్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

# మళ్లీ రిపీట్ కాబోతున్న శేఖర్ కమ్ముల

### నాగచైతన్య కాంబో.. కొత్త ప్రేమకథకు సిద్ధం!



తెలుగు సినీ పరిశ్రమలో సహజసిద్ధమైన కథలు, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. ఆయన సినిమాల్లో కనిపించే సహజత్వం, సున్నితమైన భావాలు, జీవనానికి దగ్గరగా ఉండే పాత్రలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. 'డాలర్ డ్రీమ్స్' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శేఖర్ కమ్ముల తర్వాత 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్', 'లీడర్', 'ఫిదా' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారు. ముఖ్యంగా ప్రేమకథలను సహజంగా చెప్పడంలో ఆయనకు ఉన్న ప్రత్యేకత యువతలో మంచి క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. కథలోని ఎమోషన్స్‌ను సున్నితంగా చూపించడం, పాత్రల సహజత్వాన్ని కాపాడటం, సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం శేఖర్ కమ్ముల సినిమాల ప్రధాన లక్షణాలు. అందుకే ఆయన సినిమాలు సాధారణ కథలే అయినప్పటికీ ప్రేక్షకుల హృదయాలను తాకే విధంగా ఉంటాయి. ఇక తాజాగా శేఖర్ కమ్ముల మరోసారి నాగ చైతన్య తో కలిసి సినిమా చేయబోతున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన లవ్ స్టోరీ మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ కొత్త సినిమాకు సంబంధించి ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని తెలుస్తోంది. షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఈ సినిమా కూడా భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా ఉండే అవకాశం ఉందని సమాచారం. శేఖర్ కమ్ముల స్టైల్‌కు తగ్గట్టుగా సహజమైన కథతో పాటు బలమైన భావోద్వేగాలు ఈ సినిమాలో ప్రధానంగా ఉండనున్నాయట. 2021లో విడుదలైన 'లవ్ స్టోరీ' చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాలో నాగచైతన్య రేవంత్ పాత్రలో కనిపించగా, సాయి పల్లవి మౌనికగా నటించింది. కులాంతర ప్రేమ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమా సమాజంలో ఉన్న కొన్ని సమస్యలను స్పృశిస్తూ రూపొందించడం జరిగింది. ఈ చిత్రానికి పవన్ అందించిన సంగీతం సినిమాకు పెద్ద ప్లస్‌గా నిలిచింది. అందులోని 'సారంగదరియా' పాట దేశవ్యాప్తంగా భారీగా పాపులర్ అయింది. సుమారు 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు 100 కోట్లకు చేరువగా వసూళ్లు సాధించి కమర్షియల్‌గా కూడా మంచి విజయాన్ని అందుకుంది. దీంతో శేఖర్ కమ్ముల -- నాగచైతన్య కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. ఇక నాగచైతన్య కెరీర్ విషయానికి వస్తే, ఏ మాయ చేశావే సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన తర్వాత 'మజిలీ', 'లవ్ స్టోరీ', 'తండేల్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల ఆదరణ పొందారు. మరోవైపు శేఖర్ కమ్ముల కూడా కంటెంట్ ఆధారిత సినిమాలతో దర్శకుడిగా తన ప్రత్యేకతను కొనసాగిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాబోతుందన్న వార్తలతో సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది

## క్రేజీ డైరెక్టర్‌తో సినిమా?



నాని నటించిన పీరియాడిక్ పానిండియా యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' ఆగస్ట్ 21న విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత ఆయన సుజిత్ దర్శకత్వంలో సినిమా చేస్తారు. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఈ క్రేజీ లైనప్‌ని ఇలాగే కొనసాగిస్తూ తన తర్వాతి సినిమాను కూడా నాని లైన్లో పెట్టేసినట్టు ఫిల్మ్‌నగర్‌లో టాక్ వినిపిస్తున్నది. దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పిన కథకు నాని పచ్చజెండా ఊపేశారట. సుజిత్ సినిమా తర్వాత నాని చేసేది ఈ సినిమానేనని సమాచారం. వెంకీ అట్లూరితో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని కూడా నిర్మిస్తారని వినికిడి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది.

## అందమైన జ్ఞాపకాల సమాహారం

విరాజ్ అశ్విన్ హీరోగా వినోద్ గాలి దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'గుర్తుకొస్తున్నాయి'. యశశ్రీరావు, రోహిణి హట్టంగడి, శివ నారాయణ నారిపెద్ది, ప్రియదర్శిని రామ్ ఇతర పాత్రధారులు. శుక్రవారం ఈ సినిమా గ్లింప్స్‌ను ప్రముఖ నిర్మాత నవీన్ యెర్నేని ఆవిష్కరించారు. ఇదొక జ్ఞాపకాల సమాహారమని, మన జీవితంలోని మధుర క్షణాలను గుర్తుచేస్తుందని హీరో విరాజ్ అశ్విన్ తెలిపారు. ఓ సంఘటన కారణంగా హీరో గతాన్ని మర్చిపోతాడని, ఈ క్రమంలో పండే భావోద్వేగాలు హృదయాన్ని కదిలిస్తాయని దర్శకుడు తెలిపారు. మనం జీవితంలో మిస్ అయిన వాటిని ఈ సినిమా గుర్తుచేస్తుందని నిర్మాత శరత్‌చంద్ర అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ అర్సాడా, దర్శకత్వం: వినోద్ గాలి.